సాక్షి అనంతపురం

ఆదివారం । 5 । ఫిబ్రవరి । 2023



టన్ను చీనీ రూ.28 వేలు

అనంతపురం మార్కెట్‌యార్డులో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.28 వేలు పలికాయి.



టమాట కిలో రూ.20

అనంతపురం శివారులోని కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్టంగా రూ.20, కనిష్టం రూ.5, సరాసరి ధర రూ.10 పలికింది.

గరిష్టం/కనిష్టం

32.3°/13.9°

జిల్లా అంతటా శనివారం చలి వాతావరణం కొనసాగింది. పగటి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. రాత్రి ఉష్ణోగ్రతలు కొద్దిమేర పెరిగాయి.

రైతు సంక్షేమమే లక్ష్యం

- రైతు ఉత్పత్తిదారుల సంఘాలతో కలసి పని చేస్తాం
- పాలకుడు మంచోడైతే ప్రకృతి కూడా సహకరిస్తుంది
- ఆర్బీకేలతో ఎఫ్‌పీఓల అనుసంధానం కోసం చర్యలు
- రాయలసీమ ఎఫ్‌పీఓల సమ్మేళనంలో వ్యవసాయ మంత్రి కాకాణి



మాట్లాడుతున్న మంత్రి కాకాణి గోవర్ధనరెడ్డి. చిత్రంలో మంత్రి ఉషశ్రీచరణ్, విప్ కాపు, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, ఎమ్మెల్సీ శివరామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే విశ్వ, కలెక్టర్ తదితరులు

అనంతపురం అగ్రికల్చర్: రైతు సంక్షేమం కోసం వైఎస్ జగన్ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. రైతులకు మేలు జరుగుతుందంటే ఎఫ్‌పీఓలు, ఎన్జీఓలతో కలిసి పనిచేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. శనివారం ఆర్డీటీ ప్రత్యేక విద్యార్థుల ఉన్నత పాఠశాలలో ఏఎఫ్ ఎకాలజీ డైరెక్టర్, రాష్ట్ర వ్యవసాయ మిషన్ సభ్యుడు డాక్టర్ వైవీ మల్లారెడ్డి, ఏపీ మాస్ సీఈఓ సీఎస్ రెడ్డి ఆధ్వర్యంలో రాయలసీమ స్థాయి రైతు ఉత్పత్తిదారుల సంఘాల (ఎఫ్‌పీఓల)సమ్మేళనం నిర్వహించారు. ముఖ్య అతిథి మంత్రి కాకాణి మాట్లాడుతూ పాలకుడు మంచివాడైతే ప్రకృతి, భగవంతుడు సహకరిస్తారన్న విషయం జగన్ పాలనలో రుజువైందన్నారు. మూడున్నరేళ్లుగా విస్తారంగా వర్షాలు పడుతుండటం, చేతినిండా వ్యవసాయ పనులు దొరకడంతో వలసలకు తావులేకుండా పోయిందన్నారు. తమ ప్రభుత్వ హయాంలో ఒక్క కరువు మండలం కూడా ప్రకటించలేదని గుర్తు చేశారు.

రైతు చెంతకే వ్యవసాయ సేవలు

రైతు భరోసా కేంద్రాల (ఆర్బీకేల) ద్వారా రైతు చెంతకే వ్యవసాయ సేవలు అందిస్తున్నామని మంత్రి కాకాణి తెలిపారు. రైతులు సంఘాలుగా ఏర్పడితే.. వారు పండించిన పంటలకు గిట్టుబాటు ధర దక్కడంతో పాటు తక్కువ పెట్టుబడులతో వ్యవసాయం లాభసాటిగా మారుతుందన్నారు. రైతులకు మేలు జరుగుతుందంటే ఎఫ్‌పీఓలు, ఎన్జీఓలతో కలిసి పనిచేస్తామని పునరుద్ఘాటించారు. ఇందు కోసం ఆర్బీకేలకు ఎఫ్‌పీఓలను అనుసంధానించేలా పాలసీ తయారీకి చర్యలు తీసుకుంటామని తెలిపారు. మార్కెటింగ్‌శాఖ పరిధిలో వినియోగంలో లేని గోదాములు, ఇతరత్ర మౌలిక వసతులు అద్దె లేదా లీజు ప్రాతిపదికన ఎఫ్‌పీఓలకు ఇస్తామన్నారు. రైతులకు గిట్టుబాటు కలిగేలా వినియోగదారులకు సరసమైన, నాణ్యమైన వస్తువులు అందించే దాకా అంటే ఉత్పత్తి నుంచి వినియోగం వరకు సప్లై చైన్ తీసుకువస్తామన్నారు. దేశంలో 20 వేలు, రాష్ట్రంలో వెయ్యి ఎఫ్‌పీఓలు ఉండగా... ఒక్క రాయలసీమ పరిధిలోనే 500 ఎఫ్‌పీఓలు ఉండటం ఇక్కడ వాటికున్న ప్రాధాన్యత అర్థమవుతోందన్నారు.

చిరుధాన్యపు ఉత్పత్తులందించేందుకు చర్యలు

అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరాన్ని పురస్కరించుకుని రైతులు, ఎఫ్‌పీఓలు పండించిన చిరుధాన్యాలు, వాటి ఆహారోత్పత్తులను అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతిగృహాల్లో విద్యార్థులకు అందించే విషయంపై త్వరలో నిర్ణయం తీసుకుంటామని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి కె.వి.ఉషశ్రీచరణ్ తెలిపారు. రాయలసీమలో 500 రైతు ఉత్పత్తిదారుల సంఘాలు (ఎఫ్‌పీఓలు) ఉండటం రైతులకు చాలా ఉపయోగమన్నారు. వీటిని మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కూడా ప్రోత్సహిస్తోందన్నారు.

ప్రాసెసింగ్ ప్లాంట్లతో రైతులకు మేలు

ఉల్లి, టమాట, మిరప లాంటి వాటికి ప్రాసెసింగ్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తే రైతులకు మేలు జరుగుతుందని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. గిట్టుబాటు ధరలు, సరైన మార్కెటింగ్ వ్యవస్థ, మౌలిక వసతులు పెరగాలన్నా ఎఫ్‌పీఓలు బలోపేతం కావాలని రాష్ట్ర మార్కెటింగ్‌శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ చిరంజీవిచౌదరి తెలిపారు. హార్టికల్చర్ హబ్, మిల్లెట్ హబ్, మైక్రో ఇరిగేషన్ హబ్‌గా మారిన అనంతపురం జిల్లాలో ఎఫ్‌పీఓలు, అందులోనూ మహిళా భాగస్వామ్యం ఎక్కువగా ఉండటం శుభ పరిణామమని కలెక్టర్ నాగలక్ష్మి పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి, ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ సీఈఓ శ్రీధర్‌రెడ్డి, మార్కెటింగ్‌శాఖ ఆర్జేడీ రామాంజనేయులు, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, డీసీసీబీ చైర్‌పర్సన్ ఎం.లిఖిత, ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ మాల్యవంతం మంజుల, నాటక అకాడమీ చైర్‌పర్సన్ హరిత, అగ్రిబోర్డు రెండు జిల్లాల చైర్మన్‌లు టి.రాజశేఖర్‌రెడ్డి, రమణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి, ఉద్యాన వర్సిటీ బోర్డు మెంబర్ గద్దె కేశవరెడ్డి, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి ఉపేంద్రరెడ్డి, రెండు జిల్లాలకు చెందిన వ్యవసాయ, ఉద్యాన, ఏపీఎంఐపీ, డీఆర్‌డీఏ, డీసీసీబీ అధికారులు, సీమ జిల్లాల నుంచి ఎఫ్‌పీఓలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సభా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వ్యవసాయ ఉత్పత్తులు, పరికరాల స్టాళ్లు ఆకట్టుకున్నాయి.

తుది పరిశీలనలో ‘పట్టా’ ప్రక్రియ

అనంతపురం అర్బన్: వ్యవసాయానికి యోగ్యమైన ప్రభుత్వ భూమిని సాగు చేసుకుంటున్న వారిలో అర్హులకు ఆ భూమిపై హక్కు కల్పిస్తూ పట్టా మంజూరుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రభుత్వ భూమిని సాగు చేసుకుంటున్న వారి నుంచి రెవెన్యూ యంత్రాంగం దరఖాస్తులు స్వీకరించింది. వీటికి సంబంధించి తహసీల్దారు కార్యాలయంలో ఫైళ్లు సిద్ధం చేసి.. ఆర్డీఓ ద్వారా కలెక్టరేట్‌కు పంపారు. ఇలా వచ్చిన ఫైళ్ల తుది పరిశీలన ప్రక్రియ కలెక్టరేట్‌లో ప్రారంభమయ్యింది. పరిశీలన అనంతరం లబ్ధిదారుల జాబితాను అసైన్‌మెంట్ కమిటీ ఆమోదానికి ఉంచుతారు. కమిటీకి చైర్మన్‌గా జిలా ఇన్‌చార్జ్ మంత్రి వ్యవహరిస్తారు. మంత్రి నిర్ణయించిన తేదీలో సమావేశం ఉంటుంది. అందులో ఆమోదం లభించిన తరువాత లబ్ధిదారులకు పట్టాలు మంజూరు చేస్తారు. జిల్లాలో అర్హులైన 2,090 మంది రైతులు 2,897 ఎకరాల ప్రభుత్వ భూమిలో సాగు చేస్తున్నట్లు గుర్తించారు. అయితే ఈ సంఖ్య మరికొంత పెరగవచ్చని అధికార వర్గాలు చెబుతున్నాయి.

పట్టా మంజూరుకు అర్హతలు..

- రైతు తాను సాగు చేసుకుంటున్న ప్రభుత్వ భూమి తప్ప అతనికి ఇతరత్రా పట్టా భూమి ఉండకూడదు.
- సాగు చేసుకుంటున్న భూమిపై ఇంతకు ముందు ఎవరికీ డీ–పట్టా ఇచ్చి ఉండకూడదు.
- దరఖాస్తు చేసుకున్న రైతు పొందుపరిచిన భూమిలో తప్పనిసరిగా సాగు చేస్తూ ఉండాలి.
- అర్హత ఉన్న రైతుకు తరి 2.50 ఎకరాలు లేదా మెట్ట 5 ఎకరాలకు మించకుండా డీ–పట్టా మంజూరు చేస్తారు.

ఏ భూములకు పట్టా ఇవ్వరంటే...

పోరంబోకు భూములు, వాగులు, వంకలు, కొండలు, గుట్టలకు పట్టాలు ఇవ్వరు. వ్యవసాయయోగ్యమైన భూమిని మాత్రమే అసైన్డ్ చేస్తూ డీ–పట్టా ఇస్తారు.

అనంతపురంలో కొత్త పోలీస్ సబ్‌డివిజన్

- ఉత్తర్వులు జారీ చేసిన హోంశాఖ ముఖ్య కార్యదర్శి
- ఐదు స్టేషన్లతో అర్బన్ సబ్ డివిజన్
- ఎనిమిది స్టేషన్లతో రూరల్ సబ్ డివిజన్

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఇప్పటివరకు అనంతపురం అర్బన్ మొత్తం కలిపి ఒకటే పోలీస్ సబ్‌డివిజన్‌గా కొనసాగేది. తాజాగా ప్రభుత్వం అనంతపుర రూరల్ పేరుతో కొత్త పోలీస్ సబ్‌డివిజన్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు హోం శాఖ ముఖ్యకార్యదర్శి హరీష్‌కుమార్ గుప్తా ఉత్తర్వులు జారీ చేశారు. ఇకపై అనంతపురం టౌన్, అనంతపురం రూరల్ రెండు పోలీస్ సబ్ డివిజన్లు కొనసాగుతాయి. కొత్తగా వచ్చిన అనంతపురం రూరల్ సబ్‌డివిజన్‌కు నూతన డీఎస్పీని నియమించనున్నారు. ఇప్పటివరకు అతిపెద్ద సబ్ డివిజన్‌గా ఉండటంతో పర్యవేక్షణ కొంత ఇబ్బందిగా ఉండేది. డివిజన్ పరిధిలో రాప్తాడు, ఆత్మకూరు పోలీస్ స్టేషన్లు చాలా దూరంలో ఉండటం వల్ల పోలీసు అధికారులకు ఇబ్బందులు ఉండేవి. ఇకపై అలాంటి పరిస్థితి ఉండదు. దీనిపై ఎస్పీ ఫక్కీరప్ప మాట్లాడుతూ కొత్త సబ్ డివిజన్ ఏర్పాటుతో పాలనా సౌలభ్యంగా బాగుంటుందన్నారు. సబ్‌డివిజన్ పరిధి తగ్గడం వల్ల అధికారులు మరింత చురుగ్గా పర్యవేక్షణ చేసే అవకాశం ఉంటుందన్నారు.

ఏ డివిజన్‌లో ఎన్ని స్టేషన్లు అంటే...

అనంతపురం టౌన్ సబ్ డివిజన్ పరిధిలో పీఎస్‌లు	అనంతపురం రూరల్ సబ్ డివిజన్ పరిధిలో పీఎస్‌లు
వన్‌టౌన్	అనంతపురం రూరల్
టూటౌన్	ఇటుకలపల్లి
త్రీటౌన్	రాప్తాడు
ఫోర్త్ టౌన్	ఆత్మకూరు, బుక్కరాయసముద్రం
ట్రాఫిక్ పీఎస్	శింగనమల, నార్పల, గార్లదిన్నె

దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం టౌన్: ప్రధాన మంత్రి ఉపాధి కల్పన పథకం (పీఎంఈజీపీ) కింద యూనిట్ల ఏర్పాటుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ నాగరాజరావు తెలిపారు. 15 నుంచి 35 శాతం మేర కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ అందిస్తుందన్నారు. ఆసక్తి ఉన్న యువ పారిశ్రామిక వేత్తలతోపాటు సేవా రంగం, పాడి పరిశ్రమ, కోళ్ల ఫాం, పవర్‌లూమ్స్ ఏర్పాటుకు వీలుగా పీఎంఈజీపీ ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ఒక్కో యూనిట్ రూ.20 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. వివరాలకు పరిశ్రమలశాఖ కార్యాలయంలోని హెల్ప్‌డెస్క్‌ను సంప్రదించాలన్నారు.

రెండు వాహనాల ఢీ

- 13 మందికి గాయాలు
- క్షతగాత్రులను పరామర్శించిన మంత్రి ఉషశ్రీ చరణ్

కళ్యాణదుర్గం రూరల్: స్థానిక అనంతపురం రహదారిపై బోరంపల్లి వద్ద రెండు వాహనాలు పరస్పరం ఢీకొన్న ఘటనలో 13 మంది గాయపడ్డారు. ఇందులో ఐదుగురికి తీవ్ర గాయాలు కాగా, ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. పోలీసులు తెలిపిన మేరకు... కుందుర్పి మండలం కరిగానిపల్లికి చెందిన 14 మంది శివమాలధారులు, మరో ఐదుగురు ఓ వాహనాన్ని ఏర్పాటు చేసుకుని ఇరుముడులతో శ్రీశైలం యాత్రకు వెళ్లారు. దర్శనం ముగించుకుని తిరుగు ప్రయాణమైన వీరు శనివారం తెల్లవారుజాము 4 గంటలకు కళ్యాణదుర్గం మండలం బోరంపల్లి వద్దకు చేరుకోగానే గొంచిరెడ్డిపల్లి నుంచి టమాట లోడుతో వస్తున్న బొలెరో వాహనం ఢీకొంది. ఘటనలో శివమాలధారుల వాహనం రోడ్డు పక్కన బోల్తాపడింది. అందులో ప్రయాణిస్తున్న వీరన్న, హనుమంతరాయుడు, తిప్పేస్, బొమ్మయ్య, రాజప్పకు తీవ్ర గాయాలయ్యాయి. మరికొందరు స్వల్పగాయాలతో బయటపడ్డారు. క్షతగాత్రులను స్థానికులు వెంటనే 108 అంబులెన్స్ ద్వారా కళ్యాణదుర్గం సీహెచ్‌సీకి తరలించారు. తీవ్రంగా గాయపడిన వారిని మెరుగైన చికిత్స కోసం వైద్యుల సూచన మేరకు అనంతపురంలోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. వీరిలో వీరన్న పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో బెంగళూరుకు తరలించారు. ఘటనపై కళ్యాణదుర్గం రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

మంత్రి పరామర్శ

కళ్యాణదుర్గం : రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారిని స్థానిక సీహెచ్‌సీలో మంత్రి ఉషశ్రీ చరణ్ పరామర్శించారు. ప్రమాదం గురించి తెలుసుకున్న వెంటనే ఆమె ఆస్పత్రికి చేరుకుని వైద్యులతో మాట్లాడారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని వైద్యులకు సూచించారు. అనంతరం క్షతగాత్రులతో మాట్లాడుతూ.. అధైర్య పడరాదని, అన్ని విధాలుగా అండగా ఉంటామని ధైర్యం చెప్పారు.



గాయపడిన వారిని పరామర్శిస్తున్న మంత్రి ఉషశ్రీచరణ్

దంపతుల ఆత్మహత్యాయత్నం

గుంతకల్లు : కుటుంబ కలహాల నేపథ్యంలో దంపతులు ఆత్మహత్యాయత్నం చేశారు. పోలీసులు తెలిపిన మేరకు... గుంతకల్లు మండలం పులగుట్టపల్లికి చెందిన సురేంద్ర, భారతి దంపతులు. ఏడేళ్ల క్రితం వివాహమైన వీరికి ఇద్దరు పిల్లలున్నారు. ఇటీవల కుటుంబంలో మనస్పర్థలు చోటు చేసుకుని దంపతులు తరచూ గొడవపడేవారు. ఈ క్రమంలో శనివారం మిర్చి పంటకు పురుగుల మందు పిచికారీ చేస్తున్న సమయంలో ఇద్దరూ గొడవ పడ్డారు. మనస్తాపం చెందిన భారతి అక్కడే ఉన్న పురుగు మందును తాగింది. అది చూసి సురేంద్ర కూడా పురుగుల మందు సేవించాడు. అపస్మారక స్థితికి చేరుకున్న దంపతులను చుట్టుపక్కల రైతులు గమనించి గుంతకల్లు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు అనంతపురం సర్వజనాస్పత్రికి తరలించారు. ఘటనపై రూరల్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్య

తాడిపత్రి అర్బన్: వడ్డీ వ్యాపారుల వేధింపులు తాళలేక ఓ మహిళ ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... తాడిపత్రిలోని పాతకోటలో నివాసముంటున్న షేక్ గౌస్, ఖతీజా (38) దంపతులకు ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుటుంబ పోషణ కోసం భర్తకు తెలియకుండా ఖతీజా ప్రైవేట్ వ్యక్తుల వద్ద అధిక వడ్డీకి అప్పులు చేసింది. దీంతో పాటు సొంత పూచీకత్తుపై తన ఇంటి సమీపంలోని కొందరికి అప్పులు ఇప్పించింది.ఈ క్రమంలో అప్పులు చెల్లించడంలో ఇబ్బందులు తలెత్తడంతో తరచూ వడ్డీ వ్యాపారులు ఇంటి వద్దకు చేరుకుని దుర్భాషలాడడం మొదలు పెట్టారు. ఈ విషయం తన భర్తకు తెలిస్తే గొడవవుతుందని భావించిన ఆమె శనివారం ఉదయం 9 గంటలకు ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

క్లుప్తంగా

ఐరావతంపై కొండమీదరాయుడు

• నేడు రథోత్సవం



బుక్కరాయసముద్రం:కొండమీదరాయుడి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి దేవరులతో కలసి ఐరావత వాహనంపై శ్రీవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఆదివారం జరిగే కొండమీదరాయుని రథోత్సవానికి ఆలయ కమిటీ, అధికారులు ఏర్పాట్లు చేశారు. మండల కేంద్రంలోని లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో తెల్లవారుజామున 4 గంటలకు కొండమీదరాయుని కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. 11 గంటలకు శ్రీవారిని సతీ సమేతంగా సూర్య ప్రభ వాహనంపై మండల కేంద్రంలోని పుర వీధుల్లో ఊరేగించనున్నారు. అనంతరం రథోత్సవాన్ని నిర్వహించనున్నారు. బ్రహ్మోత్సవాలకు ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు, తెలంగాణా రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలి రానున్నారు.

ఆర్ట్స్‌కళాశాల విద్యార్థికి అభినందన



విద్యార్థి దీపక్ గౌతమ్ రెడ్డిని అభినందిస్తున్న వీసీ ప్రొఫెసర్ మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి

అనంతపురం: అనంతపురం ఆర్ట్స్ కళాశాల డిగ్రీ విద్యార్థి దీపక్ గౌతమ్ రెడ్డిని ఎస్కేయూ వీసీ ప్రొఫెసర్ మాచిరెడ్డి రామకృష్ణా రెడ్డి అభినందించారు. న్యూఢిల్లీలో 74వ గణతంత్ర వేడుకల సందర్భంగా నిర్వహించిన రిపబ్లిక్ పరేడ్‌లో దీపక్ గౌతమ్‌రెడ్డి పాల్గొన్నారు. వీసీ మాట్లాడుతూ విద్యార్థి ప్రతిష్టాత్మక కార్యక్రమంలో పాల్గొని వర్సిటీతో పాటు కళాశాల ఖ్యాతిని ఇనుమడింపజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్కేయూ రెక్టార్ ప్రొఫెసర్ ఏ మల్లికార్జున రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎంవీ లక్ష్మయ్య, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ డి. మురళీధర్ రావు, ఆర్ట్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ విష్ణుప్రియ, జయలక్ష్మి, పీఆర్వో డాక్టర్ కే రాంగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

కేన్సర్‌పై అవగాహన కల్పించాలి

అనంతపురం సప్తగిరి సర్కిల్: ప్రపంచ కేన్సర్ డేను పురస్కరించుకొని ప్రజలకు అవగాహన కల్పించాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ మహిళ విభాగం అధ్యక్షురాలు డాక్టర్ హేమలత తెలిపారు. పీవీకేకే కళాశాలలో అంతర్జాతీయ క్యాన్సర్ దినోత్సవం శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు ప్రశాంతి, సుమన, ప్రత్యూష, దినకర్, బ్రహ్మానందం పాల్గొన్నారు.

ఆత్మకూరు: స్థానిక ప్రభుత్వాస్పత్రి వద్ద క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తూ వైద్య సిబ్బంది ర్యాలీ శనివారం చేశారు. డాక్టర్ సబిహా సుల్తానా మాట్లాడుతూ ముందస్తు చికిత్సలతో కేన్సర్ వ్యాధికి చెక్ పెట్టే అవకాశాలు ఉన్నాయన్నారు. ఇప్పటికే గ్రామాల్లో వైద్య సిబ్బందితో ప్రత్యేక సర్వేలు చేయించి, కేన్సర్ వ్యాధిగ్రస్తులను గుర్తిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ నాగేశ్వరయ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

10న ప్రపంచ ప్రఖ్యాత సాఖిబ్ ఇక్బాల్ షామి రాక

అనంతపురం క్రైం: ఈ నెల 10న ప్రపంచ ప్రఖ్యాత వక్త సాఖిబ్ ఇక్బాల్ షామి జిల్లాకు రానున్నారని మేయర్ వసీం తెలిపారు.నగరంలోని జూనియర్ కళాశాలలో సాఖిబ్ ఇక్బాల్ షామి తెహరిక్ పైజానే అహ్లే బైత్ తహ పూజ్ అఖాయిదే అహ్లే సున్నత్ కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందుకు సంబంధించిన పోస్టర్లను శనివారం నగరపాలక సంస్థలోని మేయర్ చాంబర్‌లో ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రహంతుల్లా, ఇస్హాక్, కో ఆప్షన్ సభ్యులు షంషుద్దీన్, నాయకులు సుభేష్, షెక్షా, మతపెద్దలు గౌస్‌పీర్‌నూర్‌భాయ్, షబ్బీర్ సయ్యద్, హుస్సేన్ పీరా, షెక్షావలి, అస్లాం పాల్గొన్నారు.

అంకితభావంతో అభ్యసించాలి



ప్రశంసాపత్రాలు అందిస్తున్న ఆర్జేయూకేటీ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ విజయకుమార్

అనంతపురం: విద్యార్థులు అంకితభావంతో అభ్యసించాలని ఆర్జేయూకేటీ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ ఎం. విజయకుమార్ అన్నారు.శనివారం జేఎన్‌టీయూ అనంతపురం ఓటీపీఆర్ఐలో బీఫార్మసీ మొదటి సంవత్సరం విద్యార్థులకు స్వాగత కార్యక్రమం నిర్వహించారు. ఇన్‌చార్జ్ వీసీ మాట్లాడుతూ బీఫార్మసీ మొదటి సంవత్సరంలోనే లక్ష్యాన్ని నిర్దేశించుకొని సాధనకు నిరంతరం కృషి చేయాలన్నారు. నాలుగేళ్ల చదువు 40 ఏళ్ల ఉద్యోగానికి దోహదపడుతుందన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ప్రతిభ చాటిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశా రు. ఓటీపీఆర్ఐ డైరెక్టర్ బి. దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చక్కా గోపీనాథ్, బోధన, బోధనేతర ఉద్యోగులు పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల సాకారం చేశాం

• ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి



సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం రూరల్: అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్ల పట్టాలతోపాటు ఇళ్లు నిర్మించి, సొంతింటి కల సాకారం చేశామని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. శనివారం రుద్రంపేట పంచాయతీ పరిధిలోని అజయ్ ఘోష్‌కాలనీ, వికలాంగుల కాలనీలో స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులతో కలసి ఎమ్మెల్యే గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిపై ఎమ్మెల్యేకు వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధిపై టీడీపీ నాయకులకు ఏమాత్రం చిత్తశుద్ధి లేదన్నారు. వారి పాలనలో కేవలం దోచుకోవడమే పనిగా పెట్టుకున్నారన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకొచ్చిన ఈ మూడున్నరేళ్లలో దాదాపు వెయ్యి కోట్లతో నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేశామన్నారు. రాబోవు రోజుల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి అనంత నియోజకవర్గాన్ని అగ్రస్థానంలో నిలుపుతామన్నారు.

టీడీపీ హయాంలో అభివృద్ధి ఏదీ? : గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరికి ఎన్ని సార్లు విన్నవించినా సమస్యలు పరిష్కరించిన పాపానపోలేదన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే తమ కాలనీల్లో సిమెంట్ రోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటు కావడంతో పాటు అన్ని మౌలిక వసతులు కల్పించామన్నారు. అన్ని వర్గాల సంక్షేమమే తమ ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీనీ అమలు చేసి, ప్రజల నమ్మకాన్ని నిలబెడతామన్నారు. అజయ్‌ఘోషకాలనీలో పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్న వితంతు మహిళలు మిడతల లక్ష్మీదేవి, కళావతికి ఎమ్మెల్యే పింఛన్లు మంజూరు చేయించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు చంద్రకుమార్,ఎంపీపీ వరలక్ష్మి, సర్పంచ్ పద్మావతి, ఎంపీటీసీ మహబూబీ, వైస్ ఎంపీపీ బాలాజీ, వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాదిక్‌వలి, మాజీ సింగిల్‌విండో ప్రెసిడెంట్ చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ కుళ్లాయప్ప, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆలమూరు శ్రీనివాసరెడ్డి, గౌస్‌బేగ్, కాంట్రాక్టర్ శివారెడ్డి, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సర్వజనాస్పత్రి తనిఖీ

అనంతపురం సప్తగిరి సర్కిల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి శనివారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన పీడియాట్రిక్ వార్డు, ఎమర్జెన్సీ వార్డులను తనిఖీ చేశారు. ఆస్పత్రి ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ డాక్టర్ రామస్వామి నాయక్‌తో ఆస్పత్రిలో ప్రస్తుతం ఉన్న ఇన్ పేషెంట్ల సంఖ్యను అడిగి తెలుసుకున్నారు. ఆక్సిజన్, ఫార్మసీలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. రోగులకు సత్వర సేవలను అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడి కుమార్తె పరామర్శ : వైఎస్సార్‌సీపీ నాయకుడు సతీష్ కుమార్తె షర్మిల అనారోగ్యంతో ప్రభుత్వ సర్వజనాస్పత్రి లో చికిత్స పొందుతోంది. ఆమెను శనివారం రాత్రి పరామర్శించారు. సూపరింటెండెంట్, వైద్య సిబ్బందితో మాట్లాడి, ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కమల్‌భూషణ్ తదితరులు పాల్గొన్నారు.

పైప్‌లైన్ పనుల పరిశీలన : నగరంలోని నడిమింక వద్ద జరుగుతున్న ప్రధాన తాగునీటి పైప్‌లైన్ షిఫ్టింగ్, బ్రిడ్జ్ పనులను ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి శనివారం పరిశీలించారు. పెద్ద పైప్‌లైన్ పనులు జరిగే సమయంలో అక్కడే ఉన్న చిన్న పైప్‌లకు తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కాంట్రాక్టర్, తదితర సిబ్బందిని ఆదేశించారు. ఈ నెల 3న అర్ధరాత్రి మరోసారి పైప్‌లైన లీకేజీ కావడంతో నగరపాలక సంస్థ నీటి సరఫరా విభాగం సిబ్బంది చేపట్టిన మరమ్మతు పనులను పరిశీలించారు. డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ట్రైసైకిళ్ల పంపిణీ : నగరంలోని 24వ డివిజన్‌కు చెందిన దివ్యాంగులు జబీవుల్లా, యాకోబు, నరసింహులు, హనుమంతరెడ్డికి దివ్యాంగుల సహకార సంస్థ సహకారంతో మంజూరు చేయించిన ట్రైసైకిళ్లను ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి శనివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ ఓబిరెడ్డి, కార్పొరేటర్లు సంపంగి రామాంజనేయులు, సుమతి, విభిన్న ప్రతిభావంతుల, వయోవృద్ధుల సహకార సంస్థ ఏడీ అబ్దుల్ రసూల్ పాల్గొన్నారు.

టౌన్ ప్లానింగ్ విభాగాన్ని ప్రక్షాళన చేయాలి

• కమిషనర్ కే భాగ్యలక్ష్మిని ఆదేశించిన మేయర్ వసీం
• స్టాండింగ్ కమిటీ సమావేశంలో బడ్జెట్‌పై చర్చ



స్టాండింగ్ కమిటీ సమావేశంలో బడ్జెట్‌పై చర్చిస్తున్న దృశ్యం, చిత్రంలో మేయర్ వసీం, కమిషనర్ భాగ్యలక్ష్మి

అనంతపురం క్రైం: టౌన్ ప్లానింగ్ విభాగాన్ని ప్రక్షాళన చేయాలని మేయర్ వసీం కమిషనర్ కే భాగ్యలక్ష్మిని ఆదేశించారు. టౌన్ ప్లానింగ్‌లోని అధికారులపై పెద్ద ఎత్తున విమర్శలు వస్తున్నాయని, విధుల్లో బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారని మేయర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకువచ్చేలా వీరి పనితీరు ఉందని మేయర్ మండిపడ్డారు. నగరపాలక సంస్థ 2023–24 వార్షిక బడ్జెట్ రూ.89.73 కోట్లను కేటాయిస్తూ అధికారులు అంచనాలు సిద్ధం చేశారు. శనివారం నగరపాలక సంస్థలోని మేయర్ చాంబర్‌లో ఆ బడ్జెట్ అంచనాలకు సంబంధించి వివరాలను అధికారులు మేయర్ వసీం, స్టాండింగ్ కమిటీ సభ్యులకు చదివి వినిపించారు. గతేడాది సవరించిన బడ్జెట్ ప్రారంభ నిల్వ రూ.83.85 లక్షలు కాగా, ఈ ఏడాది ప్రారంభ నిల్వ రూ.89.73 కోట్లు నిర్ణయిస్తూ అంచనాల్లో పేర్కొన్నారు. బడ్జెట్‌పై ఎలాంటి అభ్యంతరాలు లేకపోవడంతో త్వరలో జరగబోవు కౌన్సిల్‌లో వార్షిక బడ్జెట్‌ను ఆమోదించేందుకు సిద్ధమయ్యారు.

రాబడి రూ.94.99 కోట్లు...ఖర్చు 69.94 కోట్లు: సాధారణ జమలు రూ.94.99 కోట్లు, ఖర్చులు రూ.69.94 కోట్లగా అంచనాల్లో పొందుపర్చారు. ఆదాయ రాబడుల్లో రూ.6 కోట్ల బిల్డింగ్ లైసెన్స్ ఫీజు, రూ.కోటి బీపీఎస్ అప్లికేషన్ ఫీజు, రూ.35 కోట్లు షాపు రూము బాడుగలు, ఆస్తిపన్ను రూ.35 కోట్లు, నీటి పన్ను రూ.7 కోట్లు, ఖాళీజాగా పన్నులు రూ.4 కోట్లు, ఇంటి పన్ను అపరాధ రుసుం రూ.4 కోట్లు, ఆస్తి పన్ను మార్పిడి ఫీజులు రూ.కోట 25 లక్షలు, స్టాంపు డ్యూటీ చార్జీలు రూ.9 కోట్లకు అంచనాలు సిద్ధం చేశారు. ఖర్చులకు సంబంధించి కోర్టు నష్ట పరిహారాలకు రూ.2 కోట్లు, లైట్లు, విద్యుత్ చార్జీల చెల్లింపులకు రూ.4 కోట్లు, ఈఎస్ఎస్ఎల్ లైట్స్ నిర్వహణకు రూ.కోటి, క్లాప్ కార్యక్రమానికి రూ.3.5 కోట్లు, కార్మిక వేతనాలకు రూ.13 కోట్లు, ఇంధన ఖర్చులు రూ.3.5 కోట్లు, అద్దె వాహనాలకు రూ.2.2 కోట్లు, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ నిర్వహణకు రూ.2 కోట్లు, నీటి సరఫరా విద్యుత్ చార్జీలు రూ.7.2 కోట్లు, ఇంజినీరింగ్ కార్మికుల వేతనాల చెల్లింపుకు రూ.9.5 కోట్లు, తదితర వాటికి ఖర్చు చేసేలా అంచనాలు సిద్ధం చేశారు. మిగులు రూ.23.04 కోట్లుగా పేర్కొన్నారు. మిగులును మూలధనంలో జమ చేసి మొత్తం మూలధనం రూ.71.52 కోట్లుగా అంచనాల్లో పేర్కొన్నారు.

తొమ్మిది అంశాల ఆమోదం: స్టాండింగ్ కమిటీలో 9వ డివిజన్‌లో రూ.20 లక్షలతో సీసీ రోడ్డు, 37వ డివిజన్‌లో రూ.47 లక్షలతో సీసీ డ్రైన్, 39వ డివిజన్‌లో రూ.13.30 లక్షలతో ఖాళీ స్థలానికి ప్రహరీ , అదే డివిజన్‌లో మరో ఖాళీ స్థలం ప్రహరీ నిర్మాణానికి రూ.16.80 లక్షలు, మరో ప్రహరీకి రూ.14 లక్షలు, 45వ డివిజన్ రెండో రోడ్డు స్టడీ పార్క్‌లో రూ.47 లక్షలతో వైఎస్సార్ డిజిటల్ లైబ్రరీ, 13వ డివిజన్‌లో ఉమానగర్‌లోని భారతి ప్రాథమికోన్నత పాఠశాలలో రూ.17.01 లక్షలతో అదనపు గదుల నిర్మాణం, రూ.10 లక్షలతో పారిశుద్య కార్మికులకు దుస్తులు, 32వ డివిజన్‌లోని లక్ష్మీనరసయ్య కాలనీలో రూ.18 లక్షలతో సీసీ డ్రైన్ ఏర్పాటు చేయాలని స్టాండింగ్ కమిటీలో నిర్ణయించారు. సమావేశంలో స్టాండింగ్ కమిటీ సభ్యులు టీవీ చంద్రమోహన్ రెడ్డి, ఇస్హాక్, కమల్‌భూషణ్, సుమతి, కమిషనర్ కే భాగ్యలక్ష్మి, అదనపు కమిషనర్ రమణారెడ్డి, కార్యదర్శి సంగం శ్రీనివాసులు, ఎంహెచ్ఓ డాక్టర్ గంగాధర్ రెడ్డి పాల్గొన్నారు.

మీ హయాంలో నగరాభివృద్ధి ఏదీ?

• మాజీ మేయర్ స్వరూపపై మేయర్ వసీం ధ్వజం

అనంతపురం క్రైం: గత టీడీపీ ప్రభుత్వ హయాంలో గ్రూపు రాజకీయాలు, కుమ్ములాటలతో నగరాన్ని భ్రష్టు పట్టించారని మేయర్ వసీం అన్నారు. ఇటీవల మాజీ మేయర్ స్వరూప నగరాభివృద్ధిపై చేసిన విమర్శలపై మేయర్ స్పందించారు. శనివారం నగరపాలక సంస్థలోని మేయర్ చాంబర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. టీడీపీ ప్రభుత్వంలో ఎంపీ, ఎమ్మెల్యే, మేయర్ మూడు వర్గాలుగా చీలిపోయి అభివృద్ధిని విస్మరించారన్నారు. ప్రతిపక్ష హోదాలోనూ టీడీపీ నాయకులు గ్రూపు రాజకీయాలతో కాలం వెల్లబుచ్చుతున్నారన్నారు. కేవలం పలుచోట్ల డివైడర్లు వేసి అభివృద్ధి చేశామని ప్రచారం చేసుకున్నారన్నారు. తాము అధికారంలోకొచ్చిన తర్వాత మూడున్నరేళ్లలోనే నగరంలో రూ.313 కోట్లతో జాతీయ రహదారి, బ్రిడ్జ్ పనులు, రూ.58 కోట్లతో గుత్తి రోడ్డు కనకదాస విగ్రహం నుంచి తడకలేరు వరకు రోడ్డు, రూ.6 కోట్లతో చెరువుకట్ట కింద నుంచి ఎన్‌టీఆర్ మార్గ్ రోడ్డు నిర్మించామన్నారు. విద్యుత్‌నగర్, జేఎన్‌టీయూ రోడ్డు, ఆర్టీసీ బస్టాండ్ రోడ్డు, తదితర అభివృద్ధి చేశామన్నారు. ఎమ్మెల్యే అనంత ప్రత్యేకంగా చొరవచూపి నగరంలో డ్రైనేజీల కోసం రూ.25 కోట్లు తీసుకొచ్చారన్నారు. టీడీపీ ప్రభుత్వం ఏనాడైనా నగరాభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు తీసుకొచ్చారా? అని మాజీ మేయర్ స్వరూపను ప్రశ్నించారు.

రథోత్సవాలకు బందోబస్తు

అనంతపురం శ్రీకంఠం సర్కిల్: జిల్లాలో ఆదివారం జరుగనున్న రథోత్సవాలు, తిరునాళ్లకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ డాక్టర్ ఫక్కీరప్ప కాగినెల్లి తెలిపారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రథోత్సవాలు, తిరునాళ్లలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా గట్టి చర్యలు తీసుకున్నామన్నారు. మాఘమాసం మూడో ఆదివారం కావడంతో అశ్వత్థం నారాయణస్వామి, తడకలేరు అశ్వత్థం నారాయణ స్వామి తిరునాళ్లతో పాటు కోటంక సుబ్రహ్మణ్యస్వామి, బుక్కరాయసముద్రం కొండమీద వెంకటరమణ స్వామి, తొండపాడు బొలికొండ రంగనాథ స్వామి, వెలిగొండ భగళాంబిక అమ్మవారి రథోత్సవాలు జరుగుతున్నాయన్నారు. జిల్లా నుంచే కాకుండా ఇతర రాష్ట్రాలు, ప్రాంతాల నుంచి భక్తులు అధికంగా తరలి వచ్చే అవకాశం ఉందన్నారు. భక్తుల తాకిడికి అనుగుణంగానే చర్యలు తీసుకోవాలన్నారు. నదీ స్నానాల సందర్భంగా భక్తులు జాగ్రత్తలు పాటించాలన్నారు.

అప్పర్ భద్రాతో సీమకు నష్టం

అనంతపురం అర్బన్: కర్ణాటక రాష్ట్రం నిర్మిస్తున్న అప్పర్‌భద్రా ప్రాజెక్టుతో రాయలసీమ జిల్లాలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని ఏపీ రైతు సంఘం (సీపీఐ) నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణం నిర్మాణం ఆపాలని, బడ్జెట్‌లో కేటాయించిన నిధులను కేంద్రం వెనక్కి తీసుకోవాలంటూ శనివారం కలెక్టరేట్ ఎదుట సంఘం నాయకులు నిరసన తెలిపారు. సంఘం వర్కింగ్ అధ్యక్షుడు మల్లికార్జున మాట్లాడారు. అనంతరం డీఆర్ఓ గాయత్రిదేవికి నాయకులు వినతిపత్రం అందజేశారు. నాయకులు రామకృష్ణ, శ్రీకాంత్, నరేశ్, మధుయాదవ్, రామాంజనేయులు పాల్గొన్నారు.

విజయమే లక్ష్యంగా ముందుకెళ్లండి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్‌రెడ్డి

అనంతపురం సప్తగిరి సర్కిల్: విజయమే లక్ష్యంగా క్రీడాకారులు దూసుకెళ్లాలని నగర డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్‌రెడ్డి ఆకాంక్షించారు. స్థానిక అనంత క్రీడా మైదానం వేదికగా నిర్వహిస్తున్న విభిన్న ప్రతిభావంతుల క్రికెట్ పోటీలను ఆయన శనివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ అనంతలో క్రీడాకారులకు కొదువ లేదన్నారు. ఆర్డీటీ సీబీఆర్ డైరెక్టర్ దశరథ్, రాష్ట్ర విభిన్న ప్రతిభావంతుల క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి మధునాయక్ పాల్గొన్నారు.

ఆంధ్ర బీ జట్టు విజయం: శనివారం నిర్వహించిన మ్యాచ్‌లో ఆంధ్ర ఏ, ఆంధ్ర బీ జట్లు తలపడ్డాయి. మొదట టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఆంధ్ర బీ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 189 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన ఆంధ్ర ఏ జట్టు 18 ఓవర్లలో 142 పరుగులకు కుప్పకూలింది. దీంతో ఆంధ్ర బీ జట్టు 47 పరుగులతో విజయం సాధించింది.

ఫైనల్‌కు ఆళ్లగడ్డ ఆరోగ్యవరం జట్లు : దక్షిణ భారత సంఘం, రాయలసీమ అధ్యక్ష మండలం క్రైస్తవ యూత్‌ను ప్రోత్సహించే ఉద్దేశంతో నిర్వహించిన రాయలసీమ స్థాయి క్రిష్టియన్ క్రికెట్ టోర్నీ ఫైనల్‌కు ఆళ్లగడ్డ, ఆరోగ్యవరం జట్లు చేరాయి. శనివారం స్థానిక పీటీసీ క్రీడా మైదానంలో నిర్వహించిన సెమీస్ మ్యాచ్‌ల్లో ఆళ్లగడ్డ, ఆదోని జట్లు తలపడ్డాయి. మొదట బ్యాటింగ్ చేసిన ఆళ్లగడ్డ జట్టు నిర్ణీత 15 ఓవర్లలో 127 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన ఆదోని జట్టు నిర్ణీత 15 ఓవర్లలో 125 పరుగులు మాత్రమే చేసింది. దీంతో ఆళ్లగడ్డ జట్టు 2 పరుగులతో ఆదోని జట్టు పై విజయం సాధించి విజేతగా నిలవగా, రెండవ సెమీస్ మ్యాచ్‌లో ఆరోగ్యవరం జట్టు, గుంతకల్లు జట్లు తలపడ్డాయి. ఫైనల్ మ్యాచ్‌ను స్థానిక అనంత క్రీడా గ్రామంలో 6న నిర్వహించనున్నారు.

రాష్ట్రస్థాయి క్రీడాపోటీల్లో పాలిటెక్నిక్ జట్టు సత్తా

విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి పాలిటెక్నిక్ ఖోఖో పోటీల్లో అనంతపురం పాలిటెక్నిక్ కళాశాల బాలికల జట్టు విజేతగా నిలిచింది. అనంత బాలికల జట్టు తిరుపతిలోని పద్మావతి మహిళా పాలిటెక్నిక్ జట్టుపై విజయం సాధించి, రాష్ట్రస్థాయిలో పతకం సాధించింది. అనంత బాలికల జట్టుకు స్థానిక ఎమ్మెల్యే మల్లాది విష్ణువర్ధన్, కళాశాల ప్రిన్సిపాల్ జయచంద్రారెడ్డి, పీడీ గణేష్‌లు, రాష్ట్ర డైరెక్టర్ నాగరాణి చేతుల మీదుగా బహుమతులు అందుకున్నారు. జట్టులో నందిని, ఐశ్వర్య, అనూష, హర్షిత, మౌనిక, దివ్యబాయి, మహేశ్వరి, నిషా, అమృత, వర్షిణి, హర్షిత, హిమబిందుబాయిలు పాల్గొన్నారు.

అప్పర్‌భద్రాతో సీమకు నష్టం



మంత్రి కాకాణి గోవర్ధనరెడ్డికి సమస్య వివరిస్తున్న వి.రాంభూపాల్

అనంతపురం అర్బన్: కర్ణాటకలోని తుంగభద్ర డ్యామ్ ఎగువన చేపట్టిన అప్పర్ భద్రా లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పనులు పూర్తయితే రాయలసీమ జిల్లాలు తీవ్ర నష్ట పోతాయని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధనరెడ్డికి సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్ విన్నవించారు. ఈ విషయంగా కేంద్ర ప్రభుత్వంతో రాష్ట్ర ప్రభుత్వం చర్చించి నిర్మాణ పనులు ఆపేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆర్డీటీ ఎకాలజీ సెంటర్‌లో శనివారం నిర్వహించిన రాయలసీమ ఎఫ్‌పీఓల సమ్మేళన సమావేశానికి విచ్చేసిన మంత్రిని ఆయన కలసి వినతిపత్రం అందజేసి, మాట్లాడారు. అప్పర్ భద్రా ప్రాజెక్టు నిర్మాణంపై ఇప్పటికే ఏపీ ప్రభుత్వం అభ్యంతరం తెలిపిన విషయాన్ని గుర్తు చేశారు. అయినా ఈ ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా కేంద్రం గుర్తిస్తూ బడ్జెట్‌లో రూ.5,300 కోట్ల నిధులు కేటాయించడం దారుణమన్నారు. ఈ డ్యాం పరిధిలో అనంతపురం, కర్నూలు, వైఎస్సార్ జిల్లాల్లో 5,81,423.934 ఎకరాల ఆయకట్టు ఉందన్నారు. అప్పర్ భద్రా ప్రాజెక్టు ద్వారా మొదటి దశలో 17.4 టీఎంసీలు, రెండవ దశలో 29.9 టీఎంసీల నీటిని తుంగభద్రలోకి రాకుండా కర్ణాటక మళ్లించుకుంటే దిగువన ఉన్న హెచ్చెల్సీ, ఎల్ఎల్సీ, పోతిరెడ్డిపాడు, రాజోలిబండ డైవర్షన్ పథకాల కింద ఉన్న ఆయకట్టు నిర్వీర్యమవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు.

పోలీసుస్టేషన్‌లో ఆత్మహత్యాయత్నం

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: తన భార్యను కొందరు ఇబ్బంది పెడుతున్నారంటూ ఓ యువకుడు అనంతపురం నాల్గో పట్టణ పోలీసు స్టేషన్‌లో ఆత్మహత్యాయత్నం చేశాడు. వివరాలు... అనంతపురంలోని రుద్రంపేట సమీపంలో ఉన్న ఓ మాల్ వద్ద నివాసముంటున్న సుగాలి రవి... శనివారం ఉదయం 9 గంటలకు పోలీస్ స్టేషన్‌కు చేరుకుని శరీరంపై పెట్రోల్ పోసుకుని నిప్పు అంటించుకునే ప్రయత్నం చేశాడు. సకాలంలో కానిస్టేబుళ్లు అడ్డుకోవడంతో పెను ప్రమాదం తప్పింది. విచారణలో చాలా కాలంగా తన భార్యను కొందరు ఇబ్బంది పెడుతూ భౌతిక దాడులకు పాల్పడుతున్నారని, దీంతో జీవితం విరక్తి చెంది ఆత్మహత్యాయత్నం చేసినట్లు వివరించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

వేణుగోపాల రావు సేవలు చిరస్మరణీయం



వేణుగోపాలరావు దంపతులను సన్మానిస్తున్న వీసీ రామకృష్ణారెడ్డి

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ఎంబీఏ విభాగం ప్రొఫెసర్ వేణుగోపాల రావు సేవలు చిరస్మరణీయమని వీసీ ప్రొఫెసర్ మాచిరెడ్డి రామకృష్ణా రెడ్డి అన్నారు. ప్రొఫెసర్ వేణుగోపాలరావు జనవరి నెలాఖరున పదవీ విరమణ చేశారు. శనివారం ప్రొఫెసర్ వేణుగోపాల రావు దంపతులకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. వీసీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అంకితభావంతో విధులు నిర్వర్తించిన ప్రొఫెసర్ వేణుగోపాల రావు ఎంబీఏ విభాగంలో తమదైన ముద్ర వేశారన్నారు. కార్యక్రమంలో ఎస్కేయూ రెక్టార్ ప్రొఫెసర్ ఏమల్లికార్జున రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎంవీ లక్ష్మయ్య, పీఆర్వో డాక్టర్ కే రాంగోపాల్ పాల్గొన్నారు.

విద్యార్థుల చేతుల్లోనే దేశ భవిష్యత్

• నగర డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య



మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్ వాసంతి

రాప్తాడు: దేశ భవిష్యత్తు విద్యార్థుల చేతుల్లోనే ఉందని డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్యా అన్నారు. శనివారం పంగల్ రోడ్డు సమీపంలోని సెయింట్ విన్సెంట్ డీపాల్ ఇంగ్లిష్ మీడియం ఉన్నత పాఠశాల 33వ వార్షికోత్సవం పాఠశాల ప్రోవిన్సియల్ సూపిరియర్ నిర్మల ఉదుమల ఆధ్వర్యంలో నిర్వహించారు. డిప్యూటీ మేయర్, పాఠశాల పూర్వ విద్యార్థి వాసంతి సహిత్యా హాజరై మాట్లాడారు. విద్యార్థులు ఉన్నత స్థానాలకు ఎదగాలంటే ఉపాధ్యాయుల బోధన, తల్లిదండ్రుల సహకారం తప్పనిసరి అన్నారు. వైస్ ఎంపీపీ బోయ రామాంజనేయులు మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లల్ని పాఠశాలకు పంపగానే తమ బాధ్యత అయిపోయిందని అనుకోకూడదన్నారు. ప్రతి విద్యార్థీ కష్టపడి చదివి తల్లిదండ్రుల కల నెరవేర్చాలన్నారు. అనంతరం నిర్వహించిన సంస్కృతిక పోటీలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో పాఠశాల పౌండర్ సిస్టర్ రోజీ, మీనాక్షమ్మ ఎడ్యుకేషన్ ఆఫీసర్ రమణ, ఎస్ఎఫ్ఎస్ చర్చి విచారణ గురువులు విజయ్ కుమార్, పాఠశాల కరస్పాండెంట్ జెసింత, ప్రిన్సిపల్ అమల, విద్యా సంస్థల సూపీరియర్ జ్ఞానమ్మ, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కుటీర పరిశ్రమలకు ప్రోత్సాహం

• మార్కెటింగ్‌శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ చిరంజీవిచౌదరి



రామ్‌నగర్‌లో బేకరీని పరిశీలిస్తున్న ప్రిన్సిపల్ సెక్రటరీ, ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ సీఈవో

అనంతపురం అగ్రికల్చర్: కుటీర పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వచ్చే ఔత్సాహిక యువతీ, యువకలు, మహిళా సంఘాలు, ఎఫ్‌పీవోలు, ఎంటర్‌ప్రెన్యూర్స్‌కు ప్రోత్సాహక రాయితీలు కల్పిస్తామని రాష్ట్ర మార్కెటింగ్‌శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ చిరంజీవిచౌదరి, ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ సీఈవో శ్రీధర్‌రెడ్డి తెలిపారు. శనివారం జిల్లా పర్యటనలో భాగంగా ఉద్యానశాఖ, మార్కెటింగ్‌శాఖ అధికారులు, ఎఫ్ ఎకాలజీ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ వైవీ మల్లారెడ్డి తదితరులతో కలిసి పీఎంఎఫ్‌ఎంఈ, ఫుడ్ సొసైటీ కింద రాయితీ, బ్యాంకు రుణ సదుపాయంతో ఏర్పాటు చేసుకున్న వివిధ రకాల యూనిట్లను సందర్శించారు. గుత్తిరోడ్డులో ఉన్న వాసవిపాడి యూనిట్, రామ్‌నగర్‌లో ఉన్న ఆహార్, షిర్డీసాయి బేకరీ యూనిట్లతో పాటు కూడేరు మండలం ముద్దలాపురంలో మహిళా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేరుశనగ ప్రాసెసింగ్ యూనిట్లను సందర్శించారు. కుటీర పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వచ్చే వారికి రూ.10 లక్షల యూనిట్‌కు 35 శాతం రాయితీ ఇస్తామన్నారు. 10 శాతం లబ్ధిదారుల భరిస్తే మిగతా 55 శాతం బ్యాంకుల ద్వారా రుణసదుపాయం కల్పిస్తామన్నారు. అనంతపురం జిల్లాలో పరిస్థితి మెరుగ్గా ఉందని సంతృప్తి వ్యక్తం చేశారు.

సంక్షిప్త సమాచారం

నేడు వారపు సంత ప్రారంభం

ఆత్మకూరు: ఆత్మకూరు గ్రామ సచివాలయం-2 పక్కన , రైతు భరోసా కేంద్రం వద్ద వారపు సంత ఆదివారం ప్రారంభం కానున్నట్లు ఎంపీపీ సుబ్బర హేమలత తెలిపారు. ఎంపీపీ మాట్లాడుతూ వ్యాపారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మైదానం శుభ్రం చేయించినట్లు తెలిపారు. నాలుగు వారాల పాటు వ్యాపారులు క్రయ,విక్రయాలు జరుపుకోవచ్చన్నారు. ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఆదేశాల మేరకు , కలెక్టర్ ఉత్తర్వులతో వారపు సంత నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

సీతాముల కల్యాణం

అనంతపురం కల్చరల్: వారం రోజులుగా సాగుతున్న శ్రీరామసప్తాహంలో భాగంగా శ్రీసీతారాముల కల్యాణోత్సవం శనివారం కమనీయంగా సాగింది. చివరిరోజు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. అనంతరం వేదపండితులు సీతారామ పరిణయ ఘట్టాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు.

6,7వ తేదీల్లో గ్రామసభ

ఆత్మకూరు: మండలంలో ఈ-కేవైసీ చేయించని రైతులకు సోమ,మంగళవారాల్లో మండల కేంద్రంలోని ఆర్‌బీకేలో ప్రత్యేక గ్రామ సభ నిర్వహిస్తున్నట్లు ఏఈఓ విజయ్‌కుమార్ శనివారం తెలియచేశారు.

రైతు ఆచూకీ లభ్యం

రాప్తాడు: ఆత్మకూరు మండలం తోపుదుర్తికి చెందిన మజ్జిగ రామకృష్ణ కుమారుడు మజ్జిగ ఓబులేష్ ఆచూకీ లభ్యమైంది. బుధవారం ఉదయం మజ్జిగ ఓబులేష్ తోపుదుర్తి నుంచి రాప్తాడు మండలంలోని పాలచెర్ల సమీపంలోని వ్యవసాయ తోట దగ్గరకు వెళ్తున్నానని చెప్పి ఇంట్లో నుంచి వెళ్లి కనిపించలేదు. విషయంపై మజ్జిగ రామకృష్ణ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. శనివారం ఉదయం అనంతపురం నగరంలోని కళ్యాణదుర్గం రోడ్డులో మజ్జిగ ఓబులేస్‌ను గుర్తించారు. తహసీల్దార్ లక్ష్మీ నరసింహులు సమక్షంలో మజ్జిగ ఓబులేష్‌ను తండ్రి మజ్జిగ రామకృష్ణకు అప్పజెప్పారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని చిక్కవడియార్ చెరువులో శనివారం గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు ఎస్ఐ శివప్రసాద్ తెలిపారు. మృతుడికి 35 నుంచి 40 సంవత్సరాలు వయస్సు ఉంటుందని, ఒంటిపై తెల్లటి గీతల చొక్కా, నల్లటి జీన్స్‌ప్యాంట్ ధరించాడున్నారు. మృతుని వివరాలు, ఆచూకీ తెలిస్తే 7013064687 కు సమాచారం ఇవ్వాలని కోరారు.

మర్రి చెట్టు కొట్టేస్తున్నారని ఫిర్యాదు

అనంతపురం కల్చరల్: అనుమతి లేకుండా మర్రి చెట్టు ఎలా కొట్టేస్తారని విశ్వహిందూపరిషత్ జిల్లా అధ్యక్షుడు అక్కిశెట్టి జయరాముడు అన్నారు. హిందువులు దైవంగా పూజించే చెట్లను అనుమతులు లేకుండా కొట్టేస్తూ వారి మనోభావాలను దెబ్బతీయొద్దన్నారు. స్థానిక లక్ష్మీనగర్ డోర్ నంబర్ 6-1-832లో నివసిస్తున్న ఫక్రుద్దీన్ తన ఇంటి సమీపంలోని మర్రిచెట్టును తొలగిస్తుండగా వీహెచ్‌పీ నాయకులు జయరాముడు తదితరులు అడ్డుకున్నారు. జిల్లా అటవీశాఖాధికారికి వినతి పత్రం అందించామని, మున్సిపల్ కమిషనర్‌కు, నాల్గో పోలీసుస్టేషన్ ఎస్ఐకి ఫిర్యాదు చేశామన్నారు.వీహెచ్‌పీ ప్రాంత కార్యదర్శి కాకర్ల రాముడు, చాంద్‌బాషా పాల్గొన్నారు.

నేడు సత్యనారాయణ వ్రతం

ఆత్మకూరు: పంపనూరు సర్వరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం మాఘమాస ఉత్సవాల్లో భాగంగా ఉదయం 10 గంటలకు సామూహిక సత్యనారాయణ వ్రతం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ అక్కిరెడ్డి శనివారం తెలిపారు. ఆలయంలో రాహుకేతు హోమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.